ప్రశాంతంగా ఎప్‌సెట్

మన్సూరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ న్యూనాగోల్‌కాలనీలోని సీఐఎస్ డిజిటల్ ప్రైవేటు లిమిటెడ్ కేంద్రంలో మంగళవారం ఇంజినీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈఏపీసీఈటీ)కు 464 మంది హాజరై పరీక్షను రాశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షలో 245 మందికి గాను 229, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటలకు వరకు నిర్వహించిన పరీక్షలో 245 మందికి గాను 235 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.



ఎల్బీనగర్‌లోని పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

ఎల్బీనగర్‌లో...

వనస్థలిపురం: ఎల్బీనగర్‌లోని గుంటిజంగయ్య నగర్ కాలనీలోని పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ముందుగానే హాజరయ్యారు. మొదటి షిఫ్ట్‌లో పరీక్షకు 985 మందికి గాను 926 మంది హాజరు కాగా 59 మంది గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 985 మందికి గాను 954 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష విషయంపై పలువురు విద్యార్థులను వివరణ కోరగా కెమిస్ట్రీ మాత్రమే కొద్దిగా టఫ్‌గా వచ్చిందని, ఇతర సబ్జెక్టులు ఈజీగా వచ్చాయని తెలిపారు.

ఫేస్ కంప్రెహెన్సివ్‌లో ఫెయిల్..

ఈఏపీసీఈటీ పరీక్ష రాసేందుకు వచ్చిన 8 మంది విద్యార్థులు ఫేస్ కంప్రెహెన్సివ్‌లో ఫెయిల్ కావడంతో వారితో తెచ్చుకున్న ఇతర గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరయ్యారు. కాగా ఇందులో ఉదయం షిఫ్ట్‌లో ఇద్దరు, మధ్యాహ్నం షిఫ్ట్‌లో ఆరుగురు విద్యార్థులు ఉండటం గమనార్హం.

కర్మన్‌ఘాట్‌లో..

సంతోష్‌నగర్: కర్మన్‌ఘాట్‌లోని అయాన్ డిజిటల్ కేంద్రంలో ఎప్‌సెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష సమయానికి 2 గంటల ముందుగానే అభ్యర్థులు సెంటర్లకు చేరుకున్నారు. గంట ముందుగానే హాల్ టికెట్, ఆధార్ కార్డులను పరిశీలించి అభ్యర్థులను సెంటర్ లోకి అనుమతించారు. సెంటర్ వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.



పరీక్ష కేంద్రం వద్ద గుమికూడిన విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు

నగర శివార్లలో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పలు సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అవంతి కళాశాలలో రెండు సెషన్‌లలో మొత్తం 500 మందికి గాను 462 మంది పరీక్షలకు హాజరయ్యారు. బ్రిలియంట్ కళాశాలలో రెండు సెషన్‌లలో 360 మందికి గాను 340 మంది పరీక్షలు రాశారు. పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎప్‌సెట్ పరీక్షలకు రెండు సెషన్‌లలో 200 మంది అభ్యర్థులకు గాను 191 మంది పరీక్షలకు రాశారు.

మీర్‌పేట్‌లో...

సరూర్‌నగర్ : ఎప్‌సెట్ పరీక్షలు మీర్‌పేట్ పరిధిలోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలలో 500 మంది అభ్యర్థులకు గాను 475 మంది హాజరయ్యారు. నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి కాలేజీలో ఏర్పాటు చేసిన కేంద్రానికి 250 మంది అభ్యర్థులకు గాను 234 మంది హాజరయ్యారు. ఆయా కేంద్రాల వద్ద మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎలాంటి సమస్య తలెత్తలేదు



పరీక్షలు రాసే సమయంలో కంప్యూటర్లు మొరాయించడం, సౌకర్యాలు లేకపోవడం వంటి సమస్యలు అక్కడక్కడ చూస్తుంటాం. కానీ మా పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ప్రశ్నలు సైతం పాఠ్య ప్రణాళికలో పొందుపరిచినవే వచ్చాయి.

- రాజేందర్, గుర్రంపేట్, భూపాలపల్లి జిల్లా

సిలబస్‌లో ఉన్న ప్రశ్నలే వచ్చాయి



ఎప్‌సెట్ ఎంట్రెన్స్ పరీక్షలో సిలబస్‌లో ఉన్న ప్రశ్నలు మాత్రమే రావడం సంతోషాన్నిచ్చింది. పరీక్షలు రాసే సమయంలోనూ కంప్యూటర్లు మొరాయించడం వంటి ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు.

-కొర్ర రీతు, విద్యార్థి, గుర్రంగూడ, రంగారెడ్డి జిల్లా



మహిళా కమిషన్ ముందు హాజరైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మహిళా కమిషన్ ఎదుట సుధీర్‌రెడ్డి హాజరు

ఎల్బీనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం కార్పొరేటర్ సుజాతానాయక్‌పై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మహిళా కమిషన్ ముందు హాజరయ్యారు. తనపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మార్చి 27న తన ఎదుట హాజరు కావాలని గత నెల మహిళా కమిషన్ సమన్లు జారీ చేసింది. ఆ రోజు హాజరుకావడం కుదరదని గడువు తీసుకుని మంగళవారం తన న్యాయవాదితో కలిసి సుధీర్‌రెడ్డి కమిషన్ ఎదుట హాజరయ్యారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.



కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హనుమాన్ ఆలయంలో పాడి కౌశిక్‌రెడ్డి పూజలు

చంపాపేట, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలోని శ్రీ ధ్యానాంజనేయస్వామిని మంగళవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వేద పండితులు, అర్చకులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనం అందించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్తలు అంజిరెడ్డి, మధుసాగర్, సురేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కర్ణన్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న యాదయ్య

బల్దియా బాస్‌కు శుభాకాంక్షలు

ఎల్బీనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కమిషనర్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఆర్‌వీ కర్ణన్‌ను తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ కృష్ణ, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు మంద రవి, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కార్యదర్శి మురళీ, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బలరాం, సూపరింటెండెంట్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

చంపాపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చంపాపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పాఠశాలలో రూ.10లక్షల వ్యయంతో ఫ్లోరింగ్, గ్రీనరీ, పేయింటింగ్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. డివిజన్‌లోని మిగతా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మంచిరెడ్డి అనంతరెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

వనస్థలిపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చెపట్టాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ నాగార్జున కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చెపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

వరదనీటి నాలా పూడికతీత పనుల పరిశీలన

మన్సూరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంకు కాలనీలోని శివాలయం వద్ద చేపట్టిన వరదనీటి నాలా పూడికతీత పనులను స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల పూడికతీత పనులను చేపట్టామని తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగపు వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ : రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్‌పార్క్‌కాలనీకి చెందిన రజనికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 42,500 చెక్కును రజనీకి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, యశ్వంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



లింగోజిగూడ డివిజన్ పరిధిలోని మణిపురికాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి పేలిపోయింది. విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నరేందర్ స్థానిక కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విద్యుత్ శాఖ అధికారులను అప్రమత్తం చేయడంతో వారు అగ్నిమాపక యంత్రాన్ని రప్పించి మంటలను ఆర్పివేయించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి నష్టమూ జరగలేదని వారు తెలిపారు. విద్యుత్ ఏడీఈ హనుమంత్, ఏఈ నదీమ్, ఫైర్ అధికారి శ్యామ్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

- ఎల్బీనగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి)

చెరువులో శవమై తేలిన ఆరేళ్ల చిన్నారి

- ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమైన అభిత
- ఫెన్సింగ్ లేకపోవడంతో చెరువులో పడి మృత్యువాత

దిల్‌సుఖ్‌నగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు సరూర్‌నగర్ చెరువులో పడి ఆరేళ్ల చిన్నారి దుర్మరణం పాలైన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సరూర్‌నగర్ పోలీసులు, బాధితులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నెల్లూరు జిల్లాకు చెందిన పాలకుర్తి శ్రీను, శ్రావణి దంపతులు బతుకుదెరువు కోసం 11 ఏళ్ల క్రితం నగరానికి వలసొచ్చి సరూర్‌నగర్ గ్రీన్‌పార్క్ కాలనీ రోడ్డు నెం.14లో చెరువు పక్కన గుడిసెలలో నివాసం ఉంటున్నారు. శ్రీను దంపతులకు నలుగురు కుమార్తెలున్నారు. రెండో కుమార్తె అభిత(6). సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో తల్లి పక్కింటి వారితో మాట్లాడుతుండగా అభిత ఇంటి ముందు ఆడుకుంటూ వెళ్లిపోయింది.



అభిత మృతదేహం

మిస్సింగ్ ఫిర్యాదు

కొద్దిసేపటి తరువాత కుమార్తె ఇంటి ముందు లేదని గమనించిన తల్లి శ్రావణి చుట్టుపక్కల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. వెంటనే సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సరూర్‌నగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

చెరువులో శవమై తేలిన చిన్నారి


మంగళవారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో ఓ మృతదేహం నీటిలో తేలి ఉండడం స్థానికులు గమనించారు. స్థానికులతో పాటు శ్రీను, శ్రావణి దంపతులు మృతదేహాన్ని దగ్గరకు వెళ్లి చూసి అభితగా గుర్తించారు. సమాచారం అందుకున్న సరూర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడం మూలంగానే..!

సరూర్‌నగర్ చెరువు చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడం వల్లే కొందరు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోవడం.. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపించారు. ఫెన్సింగ్ వేయాలని పలుమార్లు డిమాండ్ చేసినా ఫలితం లేకపోయిందని తెలిపారు. అయితే, ఇటీవల రూ.5 కోట్ల వ్యయంతో ఫెన్సింగ్ వేసేందుకు టెండర్ పిలిచినా.. పనులు మాత్రం చేపట్టలేదని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఆరేళ్ల అభిత మృతి చెందిందని స్థానికులు ఆరోపించారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రీన్‌పార్క్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

షోకాజ్ నోటీసుల చింపివేత

- లక్ష్మిప్రియ కాలనీలో దర్జాగా మళ్లీ అక్రమ నిర్మాణం





వ్యాపార సముదాయానికి అధికారులు అంటించిన నోటీసు, దానిని తొలగించి నిర్మాణం చేస్తున్న యజమాని

హయత్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లో టౌన్‌ప్లానింగ్ అనుమతి లేకుండా నిర్మిస్తున్న వ్యాపార సముదాయాలకు అధికారులు ఇచ్చిన నోటీసులు చిత్తుకాగితాలుగా మారుతున్నాయి. దుకాణాలకు అంటించిన నోటీసులను తొలగించి అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు. హయత్‌నగర్ డివిజన్‌లలో ఇన్స్పెక్షన్ కాలనీ రోడ్డులోని లక్ష్మీప్రియ కాలనీలో నెల రోజులుగా ఓ వ్యక్తి అక్రమంగా వ్యాపార సముదాయాలని నిర్మిస్తున్నాడు. స్థానికులు కొందరు జీహెచ్ఎంసీ సర్కిల్ 3 టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఏప్రిల్ 9వ తేదీన ఈ భవనానికి షోకాజ్ నోటీసు జారీ చేసి అంటించారు. వెంటనే భవన నిర్మాణం పనులు ఆపివేశాడు. కొద్ది రోజులు ఆగిన తరువాత సదరు యజమాని వ్యాపార సముదాయానికి అంటించిన నోటీసును చింపేసి సోమవారం నుంచి తిరిగి పనులు మొదలు పెట్టాడు. డివిజన్‌లో ఎక్కడ చూసినా లెక్కలేనన్ని భవనాలు అక్రమంగా నిర్మిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఎవరూ పట్టించుకోక పోవడం చర్చనీయాంశంగా మారింది. మరి ఈ నిర్మాణాలపై అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తెలిపారు. మంగళవారం చైతన్యపురిలోని శ్రీసాయినగర్ కాలనీ సీనియర్ సిటిజన్ హాల్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ 11వ వార్షిక సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన పెన్షనర్లుగా గుర్తింపు పొందిన వారందరి సమస్యలను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందన్న అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి మాట్లాడుతూ 2024లో జూలైలో ఇవ్వాల్సిన పీఆర్‌సీని తక్షణమే ప్రకటించేలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 75 సంవత్సరాలు పైబడిన సీనియర్ సభ్యులను, వివాహ జీవితంలో 50ఏళ్లు పూర్తి చేసుకున్న దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మీడియా సంపాదకులు కాచం సత్యనారాయణగుప్తా, అఖిల భారత అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ గూడూరి సీత మహాలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంటి, మధుమేహం తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా

శ్రీశైలం వెళ్లిన వ్యక్తి అదృశ్యం



రాజేష్

వనస్థలిపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జనగాం జిల్లా పాలకుర్తికి చెందిన దేవసాని రాజేష్(24) డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ తన భార్య ప్రియాంకతో కలిసి వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీలో కొంతకాలంగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న సాయంత్రం విధినిర్వాహణలో భాగంగా శ్రీశైలం వెళ్తున్నట్లు తన భార్య ప్రియాంకకు చెప్పి వెళ్లాడు. రాజేష్ ఫోన్ స్విచాఫ్ రావడం ఆయన ఆచూకీ లభించకపోవడంతో భార్య మంగళవారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చెస్తున్నారు.

2 నుంచి బాలాజీ కోవెల బ్రహ్మోత్సవాలు

సరూర్‌నగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లోని శ్రీపద్మావతీ అలివేలు మంగా సమేత శ్రీవేంకటేశ్వస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను మే నెల 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తెలిపారు. ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ముందు రెండు రోజల పాటు(బుధ, గురువారాల్లో) స్వామి వారి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మే 2న శ్రీరామానుజ తిరునక్షత్రం, 3న నిత్య పూజలు, 4న ధ్వజారోహణం నిర్వహించి 5వ తేదీ సోమవారం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 6న పలు ప్రత్యేక ఆధ్మాత్మిక కార్యక్రమాలు, 7న స్వామి రథోత్సవం నిర్వహించి 8వ తేదీన నిర్వహించే చక్ర తీర్థోత్సవంతో ఉత్సవాలను ముగించనున్నట్టు ధర్మకర్తలు పేర్కొన్నారు.

శతచండీ యాగ సహిత ఏక త్రింశత్ వార్షిక బ్రహ్మోత్సవాలు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ భవానీనగర్‌లో గల శ్రీసీతా రామాంజనేయస్వామి, శ్రీసంతోషిమాత దేవస్థానం శతచండీ యాగ సహిత ఏక త్రింశత్ (31వ) వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం శతచండీ హవనం, సప్తశతి పారాయణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గణపతి పూణ్యాహవాచనం, సహస్ర మోదక హవనం నిర్వహించారు. బుధవారం ఉదయం శ్రీసంతోషిమాత అమ్మవారికి విశేష అభిషేకాలు, మూల మంత్రాది హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు దేవాలయ కమిటీ ప్రకటించింది.

నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ

హయత్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యం, మేధా చారిటబుల్ సహకారంతో పోచంపల్లి మండలం, జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి తెలిపారు. శిక్షణకు ఎంపికైన నిరుద్యోగులకు ఉచితంగా భోజనంతో పాటు హాస్టల్ వసతి ఉంటుందని, శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల లోపు ఉన్న దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ సెట్, 2 పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, ఆదాయం సర్టిఫికెట్ తీసుకుని మే 7న స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు రావాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 9133908000 లేదా 9133908111లలో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

ఇందిరమ్మ సాగర్, వేముల కత్వలో మట్టి తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సీపీఎం పోరాట ఫలితంగానే ఇందిరమ్మ సాగర్, వేముల కత్వ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో పోసిన మట్టిని తిరిగి తొలగిస్తున్నారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏర్పుల నరసింహ తెలిపారు. మంగళవారం మట్టి తొలగింపు పనులను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామంలో జీనియస్ డెవలప్‌మెంట్ పేరుతో రియల్ వ్యాపారులు ఇందిరమ్మ సాగర్‌తో పాటు వేముల కత్వ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని పెద్ద బండరాళ్లను వేసి, మట్టితో పూడ్చివేశారు. దీనిపై సీపీఎం నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇందిరమ్మ సాగర్, వేముల కత్వను సర్వే చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ హద్దులను గుర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు.

'అధిక ఫీజులు వసూలు చేస్తున్న డిగ్రీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి'



జితేందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అటెండెన్స్ పేరుతో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పలు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను దోచుకుంటూ వేధింపులకు గురిచేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్యయాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఉస్మానియా యూనివర్సిటీ ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రైవేటు డిగ్రీ కళాశాలలైన విజేత, వివేకాంద, సంఘమిత్ర, విజన్ కళాశాలల యాజమాన్యాలు డిగ్రీ ఫీజులతో పాటు అటెండెన్స్ లేని విద్యార్థుల నుంచి పెనాల్టీ పేరుతో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తూ రశీదు కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్, నాయకులు ఉదయ్‌కుమార్, అశ్విన్, జగదీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో కొనసాగుతన్న స్కూల్ సీజ్

- కోర్టు నుంచి స్టే తెచ్చుకున్న పాఠశాల యాజయాన్యం

సంతోష్‌నగర్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నకిలీ ధ్రువపత్రాలతో కొనసాగుతున్న స్కూల్‌ను సైదాబాద్ మండల విద్యాధికారులు మంగళవారం సీజ్ చేశారు. సంతోష్‌నగర్ ఈదీబజార్‌లోని వికాస్ హైస్కూల్ యాజయాన్యం నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి పాఠశాలను కొనసాగిస్తున్నట్లు సైదాబాద్ మండల విద్యాధికారులకు సమాచారం అందింది. దీంతో సైదాబాద్ మండల ఉపవిద్యాశాఖ అధికారి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించి పత్రాలను పరిశీలించి పాఠశాలను సీజ్ చేశారు. వికాస్ పాఠశాల యాజయాన్యం కోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో పాఠశాల గేటుకు స్కూల్‌ను సీజ్ చేస్తూ ఏర్పాటు చేసిన బ్యానర్‌ను తొలగించినట్లు అధికారులు తెలిపారు.